ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 2 నవంబరు 2025




పెద్దన్నవారిపల్లిలో టీడీపీ హయాంలో నిర్మించిన మేడా మల్లయ్య పక్కా ఇంటికి అప్పట్లో ఏర్పాటు చేసిన 'ఎన్టీఆర్ గృహకల్ప' బోర్డును చూస్తున్న సీఎం చంద్రబాబు



సీమ అభివృద్ధి మా ఘనత

- వ్యవసాయం, పరిశ్రమలను అభివృద్ధి చేస్తాం
- పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాం
- తప్పుచేసిన వారికి అదే చివరిరోజు
- ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తిని అభివృద్ధి చేస్తాం
- పెద్దన్నవారిపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అందరూ వదిలేస్తే మేం అభివృద్ధి చేశాం.. రక్తం పారించిన చోట నీరు పారిస్తున్నాం



ముఖ్యమంత్రికి జనం వినతులు

పుట్టపర్తి/కదిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధి తమ ప్రభుత్వ ఘనత అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. వ్యవసాయం, పారిశ్రామికంగా ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేసి, పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామని భరోసా ఇచ్చారు. తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లా అంటే రాళ్లు, ఎండిన చెరువులు, బీల్లు కనిపించేవని అన్నారు. అలాంటి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామంటే చాలా మంది ఎగతాళి చేశారని, హంద్రీనీవా జలాలతో ఆ మాటలకు నేడు సమాధానం చెప్పామని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని చెరువులకు నీరిచ్చామని, వ్యవసాయ పారిశ్రామిక రంగాలను గణనీయంగా అభివృద్ధి చేశామని అన్నారు. నేడు ఎటుచూసినా పచ్చదనం కనిపిస్తోందని, ఇది టీడీపీ ప్రభుత్వం ఘనత అని అన్నారు. రాయలసీమకు నీరు

(మిగతా 6లో...)

కదిరిని అభివృద్ధి చేస్తారు..



కదిరి ప్రాంత సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బాగా తెలుసు. కదిరిని ఆయన అభివృద్ధి చేస్తారన్న నమ్మకం ఉంది. చంద్రబాబు అధికారానికి కొత్త కాదు. కానీ ఈ మారు ఆయన ఆలోచనలలో కొత్తదనం ఉంది. ఆర్థిక అసమానతను రూపుమాపడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. హంద్రీనీవా నీటి రాకతో కొండారెడ్డి చెరువు, కొత్త చెరువు కళకళలాడుతున్నాయి. ఇక్కడికి చంద్రబాబు నీరు తెస్తే.. కొండకు అవతల ఉండే జగన్ కదిరి ప్రాంతాన్ని బాబాయ్‌ని చంపడానికి గొడ్డలి కోసం వాడుకున్నారు. కదిరి పరువు తీశారు. చంద్రబాబు పులివెందులలోని రెండు గ్రామాలకు హంద్రీనీవా నీరు ఇచ్చారు. చంద్రబాబు కాలువల్లో నీరు పారిస్తే.. జగన్ రక్తం పారించారు.

- కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెల్యే

స్థిరమైన ప్రభుత్వంతోనే అభివృద్ధి



స్థిరమైన ప్రభుత్వంతోనే అభివృద్ధి జరుగుతుంది. రాష్ట్ర విభజన తరువాత ఏపీ అభివృద్ధిని ముఖ్యమంత్రి చంద్రబాబు వేగవంతం చేశారు. ఆ తరువాత వచ్చిన జగన్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ 6 హామీలను నెరవేర్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా అడగని పథకాలను సైతం అమలు చేశారు. 2014లో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెరువులను నీటితో నింపారు. కియ పరిశ్రమకు నీరు అందించి, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారు. ప్రస్తుతం మడకశిర, పెనుకొండలో సోలార్ హబ్‌ను ఏర్పాటు చేయిస్తున్నారు. మరో 20 ఏళ్ళ పాటు టీడీపీ ప్రభుత్వం ఉండాలి. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.

- బీకే పార్థసారథి, ఎంపీ

15 శాతం వృద్ధి సాధిస్తాం..

ప్రభుత్వం పథకాలను అమలు చేసి జిల్లాలో 15 శాతం వృద్ధి రేటు సాధిస్తాం. జిల్లాలో రైతుల కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. జిల్లాను పండ్లు, కూరగాయల బాస్కెట్‌గా అభివృద్ధి చేస్తున్నాం. ఇక్కడ పండించిన అరటి, మామిడి వంటి పంటలు యూరప్‌కు ఎగుమతి చేస్తున్నాం. ఆరేళ్లలో రైతుల ఆదాయన్ని రెటింపు చేస్తాం. జిల్లాలో గొర్రెలు, పశువులు ఎక్కువగా ఉన్నాయి. వాటి సంరక్షణకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నాం. హంద్రీనీవా ద్వారా 83 చెరువులకు నీరు ఇస్తున్నాం. నేషనల్ హైవే ద్వారా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోంది. చిన్న పరిశ్రమల ద్వారా లక్ష మందికి ఉపాధి కల్పిస్తాం. కదిరి, పుట్టపర్తి, పెనుగొండ, లేపాక్షి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం.

- శ్యాంప్రసాద్, కలెక్టర్

ముందుండి నడిపించాలి..!

- ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయాలి
- టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు

కదిరి అర్బన్/తనకల్లు/నల్లచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంతో టీడీపీ కార్యకర్తలు, నాయకులు ముందుండాలని సీఎం చంద్రబాబు అన్నారు. తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో కదిరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. జనసేన, బీజేపీతో కలిసి పనిచేయాలని వారికి సూచించారు. రాక్షస పాలన అంతమోదించాలని తాను ఇచ్చిన పిలుపునకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్పందించారని, ఘన విజయం సాధించిపెట్టారని కొనియాడారు. ప్రయోగాలు చేయడంలో టీడీపీ ముందుంటుందని అన్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా కార్యకర్తలు కష్టపడినందుకే పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. పార్టీ అభ్యర్థి, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయనందుకే పులివెందులలో ఓడిపోయామని అన్నారు. గుజరాత్‌లో ఒకేపార్టీ ఐదు విడతలు అధికారంలోకి వచ్చిందని, అందుకే అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. ఇక్కడ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే, ఆ తరువాత ఎన్నికల్లో ఓడిపోయిన వెంటనే అభివృద్ధి మొత్తం ఆవిరైపోతోందని అన్నారు. 'ప్రజలు ఆమోదిస్తేనే మనం నాయకులుగా ఉంటాం. వారి ఆమోదమే శిరోధార్యం..' అని అన్నారు. కార్యకర్తలు, నాయకుల పనితీరును తాను పరిశీలిస్తున్నానని, పేదలకు సేవ చేయడంలో వెనకబడి ఉన్నారని





సమావేశంలో నాయకులు, కార్యకర్తలు

అన్నారు. రాష్ట్రంలో రూ.50 వేల కోట్లు పింఛన్లు పంపిణీ చేశామని, కానీ అందులో నాయకులు, కార్యకర్తలు పాలు పంచుకోవడం లేదని అన్నారు. తల్లికి వందనం, అన్న క్యాంటీన్, ఆటో డ్రైవర్లు, మత్స్యకారులకు సాయం, స్త్రీ శక్తి, రైతులకు సాయం.. వీటన్నింటిలోనూ నాయకులు, కార్యకర్తలు పాలు పంచుకోవాలని సూచించారు. మహిళలకు ఎన్నికల్లో 33శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని, మహిళా నాయకత్వం పెంపొందించుకోవాలని అన్నారు. పనిచేస్తున్న ప్రతి కార్యకర్తను గుర్తిస్తామని అన్నారు. వివిధ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న తీరును గణాంకాలతో వివరించారు. జాబ్ మేళాలు నిర్వహించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. రాయలసీమ అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మౌలిక వసతులు, పరిశ్రమలు తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి హంద్రీనీవా నీటిని తీసుకొచ్చి, నీటి సమస్య లేకుండా చేశామని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, గుంటూరు మేయర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు: మంత్రి సవిత



పింఛన్ అందిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి సవిత శనివారం పాల్గొన్నారు. పట్టణంలోని దర్గాపేటలో ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందించారు. వార్డు ఇన్‌చార్జ్ దాదు ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డుకు మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇచ్చిన హామీలేకాక ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు సంక్షేమ పథకాలు నిర్విరామంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్ మైనార్టీ నాయకులు షౌకత్, దాదు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, ఎగువగడ్డ క్రిష్ణమూర్తి, రమణమ్మ, సమీ, రఘు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రులు

గోరంట్ల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్ కాలనీలో బీసీ సంక్షేమ, చేనేతజౌళి శాఖ మంత్రి సవిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్యక్రమానికి వెళ్తూ మంత్రులు గోరంట్లలో ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, టీడీపీ నాయకులు బాలక్రిష్ణచౌదరి, సోమశేఖర్, నాగేనాయక్, నిమ్మల విద్యాధరణి, సుబ్బారెడ్డి, బెల్లాలచెరువు చంద్ర, ఉమ్మర్‌ఖాన్, గిరి పాల్గొన్నారు.

93.21శాతం పంపిణీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం 93.21 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు జిల్లాలోని 2,63,531 మంది ఫించన్‌దారులకు గాను 246838 మందికి రూ.107కోట్లకు పైబడి పింఛన్ సొమ్మును అందించమన్నారు. మడకశిరలో అత్యధికంగా 96.29, అత్యల్పంగా నంబులపూలకుంటలో 90.94 మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన వారికి సోమవారం పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు.

రోజూ తనిఖీలే

- పాఠశాలల పనితీరును పరిశీలించాలన్న కమిషనర్
- ఆకస్మికంగా వెళ్లాలని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు
- హెడ్మాస్టర్లూ పాఠాలు చెప్పాల్సిందే
- మంగళవారం నుంచి అమలు.. డీఈఓ సమీక్ష

(వివరాలు 6వ పేజీలో...)

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

7

12 దాకా ఈ-పంట నమోదు

ఇంటికి చేరని పింఛన్!

సొమ్ము తీసుకునేందుకు వచ్చి వృద్ధురాలికి అస్వస్థత



పింఛన్ కోసం వచ్చి పశువుల ఆస్పత్రి వద్ద పడిపోయిన వృద్ధురాలు హనుమక్క

6



భూగర్భ జలాలు పెరుగుతాయి

కొండారెడ్డి చెరువు దశాబ్దాల తరువాత నిండింది. ఎంతో సంతోషంగా ఉంది. భూగర్భ జలాలు పెంపొందుతాయి. బోర్లలో నీటిమట్టాలు పెరుగుతాయి.

-జిగిలి ఈశ్వరయ్య, తలుపుల



మరువ పారుతున్న కొండారెడ్డి చెరువు

చెరువు నిండింది.. ఆనందం పంచింది..

హంద్రీనీవా కాలువ నుంచి కొండారెడ్డి చెరువుకు నీరు

- దశాబ్దాల తర్వాత నిండిన వైనం
- అన్నదాతల హర్షాతిరేకాలు

కదిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తీవ్ర కరువు మండలం తలుపుల. వ్యవసాయం గిట్టక రైతులు అప్పుల పాలై ఊర్లు వదిలేసి వలస వెళ్లారు. ఏ మాత్రం నీటి సౌకర్యం లేక రైతులు కేవలం వర్షాధార పంట మీదే జీవితాలను కొనసాగించారు. మండలానికి జీవనాడి లాంటిది కొండారెడ్డి చెరువు. అందులో నీరు ఉంటే మండలంలో చాలావరకు సాగు, తాగునీటికి సమస్య ఉండదు. అలాంటి చెరువు దశాబ్దాల క్రితం తెగిపోయింది. కొన్నేళ్ల క్రితం మరమ్మతులు చేసినా.. నీరు మాత్రం చేరలేదు. దీంతో దశాబ్దాలుగా వట్టిపోయింది. హంద్రీనీవా కాలువ నుంచి చెరువుకు నీరిచ్చేందుకు టీడీపీ హయాంలో అడుగులు పడ్డాయి. 2019లో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం చేపట్టడంతో ఆ ఊసే లేకుండాపోయింది. ఐదేళ్లూ పట్టించుకున్న పాపాన పోలేదు. రైతులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు పోరాటాలు చేసినా.. ప్రయోజనం లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో చెరువుకు నీరు తెచ్చే పనులు మొదలయ్యాయి. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. చెరువు నింపేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఏకంగా మూడు కిలోమీటర్లు సొరంగ మార్గాన్ని తవ్వించి, ఎట్టకేలకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలను కొండారెడ్డి చెరువుకు తీసుకొచ్చారు. ప్రస్తుతం చెరువు నిండి మరువ పారుతోంది. దశాబ్దాల తరువాత చెరువు నిండి మరువ పారుతుండడంతో రైతులు, ప్రజల ఆనందాలకు అవధుల్లేవు. భూగర్భ జలం పెరుగుతుందని చెబుతున్నారు. బోరుబావుల్లో నీటిమట్టాలు పెరిగి.. బీడు భూములు సైతం సాగులోకి వస్తాయని అన్నదాతలు చెబుతున్నారు.

తాగునీటి కొరత ఉండదు



కొండారెడ్డి చెరువు నిండటంతో దిగువ ప్రాంతంలో ఉన్న తలుపుల మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో తాగునీటి కొరత ఉండదు. కొండారెడ్డి చెరువులో నీరు ఉంటే బోర్లు, బావుల్లో నీరు పుష్కలంగా ఉంటుంది. తాగునీటికి ఇబ్బంది ఉండదు. ఇన్ని సంవత్సరాల తరువాత చెరువు నిండటంతో ఆనందంగా ఉంది.

-పూల రామచంద్ర, తలుపుల

చంద్రబాబు ముందుచూపే రక్షించింది

- మొంథా తుఫాను నష్టం తగ్గింది
- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



రాయల విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు వల్లే మొంథా తుపాను నష్టాన్ని తగ్గించారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ముందస్తు చర్యలు తీసుకుని, మొంథా తుఫాను సమయంలో ప్రాణనష్టం వాటిల్లకుండా సమర్థవంతంగా ఎదుర్కొన్నారన్నారు. కాశీబుగ్గ తొక్కిసలాటలో భక్తులు మృతి చెండడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, మండల కన్వీనర్ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ పాల్గొన్నారు.

సీమ అభివృద్ధి మా ఘనత



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాలని మొట్టమొదట ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్ అని, దానిని సాధ్యం చేసింది టీడీపీ అని అన్నారు. వైసీపీ రక్తం పారించినచోట తాము నీరు పారించామని అన్నారు. తప్పు చేసేవారు ఆలోచించుకోవాలని, అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించారు.

నీటిని పైకి తెచ్చాం..

'రాష్ట్రంలో భూగర్భ జలాలు 24 మీటర్ల లోతులో ఉన్నాయి. కానీ ఉమ్మడి జిల్లాలో పది మీటర్ల దగ్గరికి తెచ్చాం. అంతటితో సంతృప్తి పడకుండా మూడు మీటర్లకు తీసుకువస్తాం. వ్యవసాయానికి టెక్నాలజీని జోడించి ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తులను పెంచుతాం..' అని చంద్రబాబు అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఏరోస్పేస్, ఐటీ, సోలార్, విండ్ పవర్, ఆటోమొబైల్ పరిశ్రమలకు అనుకూలమని, జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నామని, ఉపాధి కల్పన జిల్లాగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. టీడీపీ ప్రభుత్వంపై విశ్వాసంతోనే జిల్లాకు కియ వచ్చిందని, నేడు ఈ ప్రాంతం వైపు పరిశ్రమలు క్యూ కట్టే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. రాయలసీమను బాగు చేయలేమని అందరూ వదిలేశారని, కానీ తాము రతనాల సీమగా మార్చి చూపించామని అన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి

పుట్టపర్తిని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు అన్నారు. సత్యసాయి జయంతి వేడుకలను ప్రభుత్వ వేడుకలుగా ప్రకటించామని, ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. 'నేను పుట్టపర్తికి వచ్చినప్పుడు సత్యసాయి బాబా నా వద్దకు వచ్చారు. బంగారు అని ఆప్యాయంగా పిలిచారు. నీతో ఓ చిన్న మాట చెప్తా చేస్తావా అని అడిగారు. సరే అన్నాను. ప్రపంచం మొత్తం పుట్టపర్తికి వస్తోంది. అనంతపురం జిల్లాలో తాగునీటి సమస్య ఉంది. పైపులైను వేయిస్తాం. నీళ్లు ఇవ్వగలవా అని అడిగారు. నేను ఎల్అండ్‌టీ వారితో పనులు పూర్తి చేయించాను. కానీ గత పాలకులు మూసివేసే స్థాయికి తెచ్చారు..' అని గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాకే కాకుండా మహబూబ్‌నగర్, మెదక్ సహా పలు ప్రాంతాలకు తాగునీరు ఇచ్చిన మహనీయులు పుట్టిన గడ్డ పుట్టపర్తి అని, సేవ నేర్పిన వ్యక్తి సత్యసాయి బాబా అని అన్నారు. ఆయన శత జయంతి ఉత్సవాలను ఈ నెల 13 నుంచి 23 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. దీనికోసం మంత్రుల కమిటీని ఏర్పాటు చేశానని తెలిపారు. సత్యసాయి ట్రస్టుతో కలిసి మంత్రుల కమిటీ శత జయంతి ఉత్సవాలను పర్యవేక్షిస్తోందని అన్నారు.



మేడా రెడ్డెమ్మ ఇంటి వద్ద గ్రామస్థులతో కలిసి టీ తాగుతున్న సీఎం



మేడా రెడ్డెమ్మ ఇంట్లో దోశ వేస్తున్న సీఎం చంద్రబాబు

బాబు.. బంగారం..!

పీ4 కింద ఇద్దరి దత్తత



మహేశ్వరిని దత్తత తీసుకుంటానని చెబుతున్న మన్సూర్

పెద్దన్నవారిపల్లి ప్రజా వేదికపై పీ4 కార్యక్రమం గురించి సీఎం చంద్రబాబు వివరించారు. సీఎం సమక్షంలో ఇద్దరు మహిళలు తమ కష్టాలను చెప్పుకోగా, వారిని ఇద్దరు మార్గదర్శులు దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చారు. వేదిక జరిగిన సంభాషణలు ఇవి..

మహేశ్వరి: నమస్కారం సార్. నాకు ఇద్దరు అన్నలు. వారికి పెళ్లి అయింది. నాకు చిన్నప్పుడే రెండు కాళ్లు వంకర్లు పోయాయి. స్కూల్‌కు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డాను. పుస్తకాలను కూడా మోయలేకపోయాను. నా స్నేహితులే పుస్తకాలు తీసుకొచ్చేవారు. నా రెండు కాళ్లకు ఆపరేషన్ చేశారు. కష్టపడి చదువుకున్నాను. మా రెండో అన్న చనిపోయారు. వారి పిల్లలను పోషించుకుంటున్నాం. నా తల్లిదండ్రులను పోషించుకుంటున్నాను.

చంద్రాబు: ఏమి చదువుకున్నావమ్మా..?

మహేశ్వరి: ఇంటర్ వరకు చదువుకున్నాను సార్. పింఛన్ డబ్బుతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. మా అమ్మకు గుండె సమస్య ఉంది. నాకు పెళ్లి కాలేదు. ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పిస్తే మా కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. పింఛన్ డబ్బుతోనే మా జీవనం సాగుతోంది.

చంద్రబాబు: మహేశ్వరికి తల్లిదండ్రులు మాత్రమే ఉన్నారు. పింఛన్‌నే ఆధారం. వచ్చిన ఆదాయం చాలడంలేదు. అందుకే ఈ అమ్మాకి మార్గదర్శిని ఏర్పాటు చేస్తున్నాం.

మన్సూర్(మార్గదర్శి): నమస్కారం సార్. నా పేరు మన్సూర్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. నాకొచ్చే ఆదాయంలో కొంత ప్రజలకు ఖర్చు చేయాలని ఎన్జీఓను స్థాపించాను. విద్య, వైద్యం, దివ్యాంగులకు చేయూత వంటి సేవలు చేస్తున్నాను. తలుపుల ప్రాథమిక వైద్యశాలలో ప్రతి నెలా గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నాను. మహేశ్వరిని బంగారు కుటుంబం కింద నేను దత్తత తీసుకుంటున్నాను. ఉద్యోగ కల్పనకు కృషి చేస్తాను. విద్య విషయంలోనూ సాయపడతాను.

సీఎం: మంచి ఆలోచన. ఇటువంటి వారు మరికొంతమంది మార్గదర్శులుగా ఉండాలి. అందుకే ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాం.



సీఎం సమక్షంలో మహిళ చైతన్య, రైతు సుబ్బారెడ్డి

చైతన్య: నమస్కారం సార్. నా పేరు దేవర్ల చైతన్య. నా భర్త పేరు దేవర్ల ఉమాపతి. నాది పేద కుటుంబం. పిల్లలను పోషించుకోవడానికి చాల ఇబ్బందులు పడుతున్నాం.

చంద్రబాబు: ఎంతమంది పిల్లలమ్మా..?

చైతన్య: ముగ్గురు సార్.

సీఎం: ఏమి చదువుతున్నారమ్మా..?

చైతన్య: కూతురు 8వ తరగతి, కొడుకులు ఐదో తరగతి, మూడో తరగతి సార్.

సీఎం: ముగ్గురికీ తల్లికి వందనం వచ్చిందామ్మా..?

చైతన్య: వచ్చింది సార్. మాకు ఉండటానికి ఇల్లు లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇల్లు కావాలి, పిల్లలకు మంచి స్కూల్ కావాలి సార్.

సుబ్బారెడ్డి (మార్గదర్శి): నమస్కారం సార్. నేను రైతును. పది ఎకరాల పొలం ఉంది. మామిడి, వరి, వేరుశనగ పంటలు సాగుచేస్తాం.

సీఎం: ఈ అమ్మాయికి సహాయపడే శక్తి మీకుందా..?

మార్గదర్శి: ఉంది సార్. విద్య, వైద్యానికి సాయం చేస్తాను సార్.

సీఎం: ఇల్లు కట్టించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. వెంటనే ఇల్లు కట్టించి ఇవ్వండి(అధికారులకు ఆదేశం). ఆ అమ్మాయికి ఏమికావాలో సుబ్బారెడ్డి సమకూరుస్తారు.

ఇంటికి చేరని పింఛన్!

- సొమ్ము తీసుకునేందుకు వచ్చి వృద్ధురాలికి అస్వస్థత



అస్వస్థతకు లోనైన వృద్ధురాలిని 108 వాహనంలో తరలిస్తున్న గ్రామస్థులు

రొద్దం/బొమ్మనహాళ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం గట్టిగా ఆదేశిస్తున్నా.. నేటికీ కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక చోటుకి లబ్ధిదారులను పిలిపించుకుని, అందరికీ అక్కడే అందజేస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రొద్దంలోని హరిజనవాడకు చెందిన వృద్ధురాలు హనుమక్క నడవడానికి ఇబ్బందిపడుతోంది. అలాంటి వృద్ధురాలి ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేయాల్సిన సచివాలయ సిబ్బంది.. ఆమెనే రావాలన్నారు. దీంతో అర కిలోమీటరు దూరంలో ఉన్న పశువుల ఆస్పత్రికి పింఛన్ సొమ్ము కోసం వృద్ధురాలు శనివారం వెళ్లారు. నీరసంతో అస్వస్థతకులోనై, అక్కడే పడిపోయారు. దీంతో టీడీపీ నాయకుడు ఉగ్గిరప్ప 108 వాహనంలో పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. రొద్దం-1 సచివాలయ ఉద్యోగులు రొద్దం మండల కేంద్రంలోని పాత హరిజనవాడలో పంపిణీ చేయాల్సి ఉండగా... వారందరినీ పశువుల ఆస్పత్రికి రప్పించడంతోనే హనుమక్క అస్వస్థతకు లోనైనట్లు స్థానికులు మండిపడుతున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ రామ్‌కుమార్‌ను అడగ్గా.. విషయం తమ దృష్టికి రాలేదనీ, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్



ఒకే చోట పింఛన్ సొమ్ము పంపిణీ

బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గ్రామంలో పింఛన్ పంపిణీలో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శనివారం గ్రామంలో ఒకేచోట పంపిణీ చేయడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సచివాలయ సిబ్బంది తీరుపై మండిపడ్డారు.

విద్యతోనే చైతన్యం

- గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు

అనంతపురం విద్య, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే చైతన్యం సాధ్యమనీ, ప్రతి గిరిజన బిడ్డ బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు (డీడీ) శ్రీనివాసరావు సూచించారు. గిరిజన నేతలు బిర్సాముండా, అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నగరంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో శనివారం గిరిజన స్వాభిమాన ఉత్సవాలు ప్రారంభించారు. తొలుత ర్యాలీ చేపట్టారు. బిర్సాముండా, అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గిరిజనులను చైతన్యవంతులను చేయడానికి బిర్సాముండా, అల్లూరి చేసిన కృషి ఎనలేనిదన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన గిరిజన విద్యార్థులకు బహుమతులు అందజేసి, అభినందించారు.

పీఏబీఆర్ గేట్లు బంద్

- కొనసాగుతున్న జల విద్యుదుత్పత్తి



డ్యాం గేట్లను అధికారులు మూసివేసిన దృశ్యం

కూడేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) ప్రధాన గేటును శనివారం బంద్ చేశారు. ఐదు రోజులుగా గేట్లు ఎత్తి మిడ్ పెన్నార్‌కి నీటిని వదిలారు. ప్రస్తుతం డ్యాంలోని జల విద్యుత్ కేంద్రంలో ఒక టర్బైన్‌తో 885 క్యూసెక్కుల నీటిని వినియోగించి దాదాపు 75వేల యూనిట్ల కరెంటు ఉత్పత్తి చేస్తున్నారు. డ్యాంలో నీటి మట్టం 435.500 మీటర్లకు చేరింది. నీటి నిల్వ 5.214 టీఎంసీల చేరిందని ఇరిగేషన్ ఏఈఈ లక్ష్మీదేవి తెలిపారు. డ్యాంలోకి లింక్ చానల్ నుంచి 100 క్యూసెక్కులు, హంద్రీనీవా నుంచి 60 క్యూసెక్కుల నీరు మాత్రమే ఇన్‌ఫ్లో ఉందనీ, 1000 క్యూసెక్కుల బయటకు వదులుతున్నట్లు ఆమె తెలిపారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 27 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు చెప్పారు.

కసాపురం ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్



ఆలయం వద్ద మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి సహకరిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ తెలిపారు. ఆయన శనివారం ఆలయాన్ని సందర్శించారు. ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ కసాపురం ఆలయం అభివృద్ధి చెందితే గుంతకల్లు పట్టణం కూడా అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. ఆలయానికి రూ.10 కోట్లు విరాళాలు రావడం అభినందనీయమన్నారు. దేవాలయంలో వసతి గదులు శుభ్రంగా ఉంచాలన్నారు, భోజనశాలను పెద్ద హాల్‌లో ఏర్పాటు చేయాలని, అవకతవకలు జరగకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహేష్, రాము, రామాంజినేయులు, దేవేంద్ర, ఎస్ఎండీ గౌస్, ఈశ్వరయ్య, ఉమర్‌బాషా, నాగరాజు, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య.. విజయానికి తొలి అడుగు

- మొబైల్స్ ఇండియా ఏజీఎం అశోక్‌కుమార్



జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయానికి ఉన్నత విద్య తొలి అడుగు అని మొబైల్స్ ఇండియా లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) అశోక్‌కమార్ అన్నారు. ఇటుకలపల్లి సమీపంలోని అనంతలక్ష్మి కాలేజీలో ఎంబీఏ, ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే శనివారం నిర్వహించారు. అశోక్‌కుమార్‌తోపాటు అనంతలక్ష్మి విద్యాసంస్థల చైర్మన్ అనంతరాముడు జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ..ఎంబీఏ, ఎంసీఏ.. విద్యార్థులకు నాయకత్వం, నిర్వహణ, వ్యూహాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలను అందించే ప్రతిష్టాత్మక కోర్సులన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రతి విద్యార్థి మంచి ఉద్యోగాలను సాధించాలన్నారు. అనంతరం ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మొమెంటోలను వారు అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎంబీఏ విభాగాధిపతి చక్రధర్ పాల్గొన్నారు.

రోజూ తనిఖీలే

- పాఠశాలల పనితీరును పరిశీలించాలన్న కమిషనర్
- ఆకస్మికంగా వెళ్లాలని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు
- హెడ్మాస్టర్లూ పాఠాలు చెప్పాల్సిందే
- మంగళవారం నుంచి అమలు.. డీఈఓ సమీక్ష



ఏడీ, ఏసీ, సూపరింటెండెంట్లు, ఐటీ సెల్ సిబ్బందితో చర్చిస్తున్న డీఈఓ

అనంతపురం విద్య, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు జిల్లా విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పాఠశాలలు రోజువారి తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఉపాధ్యాయుల బదిలీలు, నియామకాలు పూర్తయిన నేపథ్యంలో బోధనాభ్యసన ప్రక్రియపై దృష్టి సారించాలని డీఈఓ నిర్ణయించారు. పాఠశాలలో అకడమిక్ కేలండర్ మేరకు బోధన జరుగుతోందా ? టీచర్లు, విద్యార్థుల హాజరు ఎలా ఉంది? టీచర్లు నోట్‌బుక్స్ రాయిస్తున్నారా? రాసిన వాటిని చూస్తున్నారా? పదోతరగతి విద్యార్థుల పరిస్థితులు తదితర వాటిగురించి తెలుసుకోవడానికి పాఠశాలలు రోజూ తనిఖీ చేయాలని ఇదివరకే విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాలు అమలు చేయడం కోసం శనివారం కార్యాలయంలో ఏడీలు, ఏసీ, సూపరింటెండెంట్లు, ఐటీసెల్ సిబ్బందితో డీఈఓ సమీక్షించారు. తనిఖీలను మంగళవారం నుంచి ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు.

● మంగళవారం నుంచి శనివారం వరకు..

డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓ-1, ఎంఈఓ-2లు ప్రతి రోజూ తప్పనిసరిగా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓ-2మాత్రమే పాఠశాల తనిఖీకి వెళ్లేవారు. ఇపుడు ఎంఈఓ-1 సైతం తనిఖీకి వెళ్లాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, టీచర్ల సంఖ్య, హాజరు. టీచర్లు ఉదయం 9గంటలకు హాజరు వేశారా? పిల్లల హాజరు సమయానికి వేసి ఆన్‌లైన్‌లో పంపారా? బోధన ఎలా ఉంది తదితర విషయాలను పరిశీలించి రికార్డులలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఎవరు ఎక్కడకు వెళ్లారో అక్కడకు సంబంధించిన ఫొటోలను తనిఖీ అధికారులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వారంలో ప్రతి మంగళవారం నుంచి శనివారం వరకు తనిఖీలు చేస్తారు. సోమవారం గ్రీవెన్స్‌లలో అధికారులు ఆయా స్థాయిలో హాజరుకావాల్సి ఉంటుంది.

● ప్రతి హెచ్‌ఎం బోధించాల్సిందే

ఇటీవల కాలంలో పని ఒత్తిడి పేరుతో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పాఠాలు బోధించడం లేదు. అధికారుల తనిఖీలు లేకపోవడం, ఎంఈఓలే డిప్యూటీ డీఓలుగా ఉండటం, హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఎంఈఓలుగా కొనసాగుతుండటం వల్ల ఎవరూ ఎవరినీ ప్రశ్నించే పరిస్థితులులేవు. అందుకే కమిషనర్ విజయరామరాజు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూడా వారానికి ఐదు పిరియడ్లు వారి సబ్జెక్టును తప్పనిసరిగా బోధించాలని ఆదేశించినట్లు డీఈఓ ప్రసాద్ బాబు వెల్లడించారు. తనిఖీలకు వెళ్లినపుడు హెచ్‌ఎంల బోధనను కూడా పరిశీలించాలని సూచించారు.

● పాఠశాల పని వేళల్లో రావొద్దు

పాఠశాల పని వేళల్లో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, టీచర్లు ఎవరూ కూడా విద్యాశాఖ కార్యాలయాల వద్దకు రాకూడదని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. ఎవరికైనా పనులు ఉంటే బడి సమయం ముగిసిన తర్వాత వచ్చి వినతులు ఇచ్చుకోవచ్చు. వాటి పరిష్కారానికి అధికారుల నుంచి ఉత్తర్వులు పొందవచ్చు. ఇందుకోసం డీఈఓ, డిప్యూటీ డీఈఓలు ప్రతి రోజూ సాయంత్రం 5గంటలనుంచి 6గంటలవరకు ఆఫీస్‌లలో అందుబాటులో ఉండాలని కమిషనర్ ఆదేశించారని డీఈఓ తన సమీక్షలో వివరించారు.

● పది ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఎంతమంది పిల్లలు పదో తరగతి చదువుతున్నారు? వారి సామర్థ్యాలు ఏస్థాయిలో ఉన్నాయో తనిఖీలకు వెళ్లినపుడు అధికారులు ఆరా తీయాలన్నారు. తర్వాత ఆ విద్యార్థుల సామర్థ్యాలను బట్టి ఏ,బీ,సీ,డీలు గా విభజించి సీ, డీ కేటగిరి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని డీఈఓ సూచించారు. ఇలా చేస్తే పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉంటుందని డీఈఓ పేర్కొన్నారు.

సస్య రక్షణతోనే అధిక దిగుబడులు

- రేకలకుంట శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం



సుబ్రహ్మణ్యం, శాస్త్రవేత్త

బుక్కరాయసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్య రక్షణ చర్యలతో పండ్ల తోటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని రేకలకుంట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మొంథా తుపాను వల్ల ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటలకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. ఈదురు గాలులకు స్వల్పంగా మొక్కలు ఒరిగాయే కానీ ఎక్కడా నష్టం జరగలేదన్నారు. అయితే గత ఐదు రోజులుగా కురిసిన వర్షాల వివిధ రకాల తెగుళ్లు ఆశించినట్లు తెలిపారు. వాటి నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్త పలు సూచనలు చేశారు.

● ప్రస్తుతం వరుసగా కురిసిన వర్షాలకు అరటిలో సిగటోక తెగలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. దీని నివారణకు టిల్ట్0.5 మి.లీ లేదా కవచ్2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

● దానిమ్మ పంటలో ఆకులు, కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడటం, కాయలు పగిలి కుళ్లిపోవడం వంటి లక్షణాలతో మచ్చ తెగులు, లేదా కాయకుళ్లు (ఫ్రూట్‌రాట్) ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి కార్బండజిమ్ 1 గ్రామకూడా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవచ్చు

● చీనీ(బత్తాయి) పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పొలుసు పురుగు వస్తోంది. తెగులుతో చెట్టు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉంది. ఆకులు లేకుండా కొమ్మలు మాత్రమే ఉంటాయి. నివారణకు కాండాన్ని , కొమ్మలను గోనే సంచి(పట్టా)తో రుద్ది కెలియాల్ ఆయిల్ 5 మి.లీ లేదా హర్టి మినరల్ ఆయిల్ 5 మి.లీ, డైమిథోయోట్2. మి.లీ లేదా బుప్రొఫెజిన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి మొక్క బాగా తడిసేలా పిచికారీ చేసుకోవాలన్నారు.

● బొప్పాయిలో కాండం కుళ్ళు (స్టెమ్‌రాట్) బుజు తెగులు వచ్చే అవకాశం ఉంది. ఈ తెగులు సోకితే కాండం మొదలు వద్ద నీరు చేరి కుళ్లిపోవడం, ఆకుల కింద తెల్లటి బూజు కనిపిస్తుంది. నివారణకు కాండం కుళ్లిన చోట కాపర్ ఆక్సీక్లోరైడ్ 4 గ్రా., లీటరు నీటిలో కలిపి పూయాలి. శిలీంధ్ర నాశకాలైన మెటలాక్సిల్ 2 గ్రా-లీటరు నీటితో పిచికారీ చేయాలన్నారు.

● ప్రస్తుతం మిరప పంట అక్కడక్కడ శాఖీయ దశలో ఉంది. ప్రస్తుత వాతావరణం తామర పురుగు, పచ్చ పురుగు ఆశించడానికి అనుకూలం. తామర పురుగుల నివారణకు నీలం, పసుపు రంగు జిగిరు అట్టలు ఎకరాకు 30-40 వరకు పెట్టుకోవాలి. అలాగే 10000 పీపీఎం వేప నూనెను 1.0మి.లీ లేదా అసిటమాప్రిడ్ 0.2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చపురుగు నివారణకు ఎమా మెక్టిన్ బెంజోయెట్ 0.4 లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● వరి పంటలో వాన నీటిని నీటిని తీసివేయాలి. ప్రస్తుతం వరి పంట కంకి ప్రారంభ దశ నుండి గింజ వృద్ధి దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో సుడిదోమ ఆశించడానికి అవకాశం ఉంది. సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే పైమెట్రోజిన్ 0.6 గ్రా లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా - లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. బ్యాక్టీరియా, ఆకు మచ్చ తెగులు నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 30 గ్రా, స్ట్రెప్టోక్లిన్ 1 గ్రా. 10 లీటర్లనీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు రైతుల నిరాశ చెందకుండా ఉద్యానశాఖ శాస్త్రవేత్తలను సంప్రదించి సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

పప్పుశనగలో పచ్చపురుగు

బెళుగుప్ప, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల తేమ ఎక్కువై పప్పుశనగ పైరుకు పచ్చపురుగు ఆశించింది. ముందస్తు వర్షాలు కురవడంతో ఈ ఏడాది 15 రోజులు ముందుగానే మండలంలో పప్పు శనగ పంట సాగు చేశారు. మండలంలో తగ్గుపర్తి, బెళుగుప్ప, దుద్దేకుంట, గంగవరం, ఎర్రగుడి, వెంకటాద్రిపల్లి తదితర గ్రామాలలో అత్యధికంగా పప్పుశనగ పంటలు సాగు చేశారు. మండల వ్యాప్తంగా 9300 ఎకరాల్లో ఈ పంట సాగు చేశారు. ఓ పక్క వేరుకుళ్లు తెగులు సోకి మొక్కలు చనిపోతుండగా, మరో పక్క పచ్చపురుగు ఆశించడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పచ్చపురుగు నివారణకు లీటరు నీటికి నాలుగు గ్రాముల ఇమమేకటిస్ బెంజో ఎట్ పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ రైతులకు సూచించారు.





పచ్చపురుగు నివారణకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్న రైతు వన్నూరుస్వామి, పైరును పచ్చ పురుగు ఆశించిన దృశ్యం

కాలువలో పడి విద్యార్థి మృతి


పృథ్వీరాజ్ (ఫైల్)

పెద్దవడుగూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పృథ్వీరాజ్(14) శనివారం యాడికి కాలువలో పడి మృతి చెందాడు. బుర్నాకుంట గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ బంధువుల వివాహం నేపథ్యంలో రెండురోజులుగా పాఠశాలకు వెళ్లలేదు. తల్లి శశికళ శనివారం పొలం పనికి వెళ్లడంతో ఆమెకు భోజనం తీసుకుని ఆ బాలుడు బయల్దేరాడు. అయితే యాడికి కాలువ వంతెన దాటే సమయంలో ప్రమాదవశాత్తు జారి నీటిలో పడ్డాడు. అక్కడ ఉన్న కొందరు గమనించి పృథ్వీరాజ్‌ను బయటకు తెచ్చారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. ఇప్పటికే భర్తను పోగొట్టుకుని బతుకుతున్న ఆ తల్లి కుమారుడి మృతితో కుప్పకూలిపోయింది. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

గార్లదిన్నె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బాలికను వంచించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన ఓ బాలిక ఇంటర్మీడియట్ వరకు చదువుకుని, అనంతపురంలో ఓ దుస్తుల దుకాణంలో పనిచేస్తుండేది. కొన్ని నెలల క్రితం ఓ వివాహ కార్యక్రమంలో పామిడి మండలం పాళ్యం తండాకు చెందిన సురేష్ నాయక్ పరిచయం అయ్యాడు. వివాహం చేసుకుంటానని సురేష్ మాయమాటలు చెప్పి.. లోబరుచుకున్నాడు. మూడురోజుల క్రితం బాలికకు కడుపునొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. గర్భం దాల్చినట్లు తేలింది. విషయం తెలుసుకున్న యువకుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సురేష్ నాయక్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్కూటీలో ఉంచిన రూ.6 లక్షలు చోరీ

గుత్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద స్కూటీలో ఉంచిన రూ.ఆరు లక్షలు చోరీ అయినట్లు బాధితుడు ఓబులేసురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దవడూగురు మండలం కాశేపల్లి గ్రామానికి చెందిన ఓబులేసురెడ్డి కొంతకాలంగా స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్నాడు. చేసిన అప్పులు తీర్చడం కోసం భూమిని విక్రయించాడు. వచ్చిన డబ్బును రుణదాతలకు ఇచ్చేందుకు తన స్కూటీ డిక్కీలో రూ. 6లక్షలు ఉంచుకుని బయల్దేరాడు. అయ్యప్పమాల ధరించి ఉండటంతో స్వామిని దర్శనం చేసుకునేందుకు అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్లాడు. స్వామిని దర్శించుకుని బయటకు వచ్చిన తరువాత తన స్కూటీలో ఉంచిన నగదు చోరీ అయినట్లు గమనించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు


పట్టుబడిన నిందితులు, చోరీ సొత్తును చూపుతున్న ఎస్ఐ

ధర్మవరంరూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను శనివారం ఆయన స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చిగిచెర్ల గ్రామంలో వీరముద్దప్ప గుడి, గొట్లూరులో మహంకాళమ్మ, పెద్దమ్మ గుడి, రాంపురంలోని సత్యమ్మ ఆలయాల్లో జరిగిన చోరీలపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిపై పలు కోణాల్లో విచారణ చేసినట్లు వెల్లడించారు. ఈక్రమంలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన గురునాథం అంజయ్య, గురునాథం ఆంజనేయులు, కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా ఎగువపల్లికి చెందిన గురునాథం వెంకటేశ్వర్లు చోరీలు చేసినట్లు తేలడంతో వారిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 30 వెండి గొడుగులు, (340గ్రాములు) మూడు గ్రాముల బంగారం తాళిబొట్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురు ఊరు చివరన ఉన్న ఆలయాలపై రెక్కీ నిర్వహించి, రాత్రి పూట చోరీలకు పాల్పడేవారని తెలిపారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగు


నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగుదారి చూపినట్లు యువర్స్‌ఫౌండేషన్ ప్రెసిడెంట్ పోలాప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని తొగటవీధికి చెందిన పెద్దకోట్ల రామకృష్ణ(70) శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాసులు, వెంకటనారాయణ మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర నేత్రాలను సేకరించారు. నేత్రాదానికి సహకరించిన మృతుడి భార్య నాగరత్న, కుమారుడు రాజేంద్రకు యువర్స్‌ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో వీరంగం

అమ్మవారి విగ్రహం ముక్కు ధ్వంసం
హుండీ సొమ్ము అపహరణ


అమ్మవారి విగ్రహం ముక్కును ధ్వంసం చేసిన దుండగులు

నార్పల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మారెమ్మ గుడిలో శుక్రవారం రాత్రి తాగుబోతులు వీరంగం చేశారు. అమ్మవారి విగ్రహం ముక్కును ధ్వంసం చేసి, ఆలయంలోని హుండీని అపహరించారు. ఆలయ పరిసరాల్లో మద్యం తాగి, బాటిల్, వాటర్ ప్యాకెట్లు అక్కడే వదిలేశారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండగులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని కోరుతూ నార్పల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్ఐ సాగర్, సీఐ కౌలుట్లయ్య ఆలయాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. ఆలయంలో వీరంగం చేసిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.


ఆలయంలో చెల్లాచెదురుగా విసిరేసిన వస్తువులు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నలుగురికి గాయాలు



రోదిస్తున్న పెద్దపుల్లన్న భార్య కుటుంబ సభ్యులు, పెద్ద పుల్లన్న (ఫైల్)



ప్రజ్వల్‌ను ఒడిలో పెట్టుకుని బోరున విలపిస్తున్న వన్నూరక్క పొలంలో కారు

గుంతకల్లుటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శనివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా.. నలుగురు గాయపడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం అలుముకుంది. గుంతకల్లు మండలం తిమ్మాపురం గ్రామం వద్ద కూలీల ఆటో బోల్తా పడి ఒకరు దుర్మరణం చెందగా.. ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని దంచర్ల గ్రామానికి చెందిన పెద్ద పుల్లన్న (45) ప్రాణాలు కోల్పోయాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దంచర్ల గ్రామానికి చెందిన పదిమంది వ్యవసాయ కూలీలు ఆటోలో దోనిముక్కల గ్రామ సమీపంలోని పొలంలో పనులకు వెళ్లారు. మధ్యాహ్నం పని ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. తిమ్మాపురం గ్రామ సమీపంలోకి రాగానే వెనుక వస్తున్న టిప్పర్ డ్రైవర్.. ముందు గొర్రెల మందను పక్కకు తిప్పాడు. టిప్పర్ ఎక్కడ తగులుతుందోనని ఆటోను డ్రైవర్ పక్కకు తిప్పాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో పెద్ద పుల్లన్న అక్కడికక్కడే మృతిచెందగా.. రంగస్వామి, ఎల్లప్ప, రామాంజనేయులు గాయపడ్డారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దపుల్లన్నకు భార్య సువర్ణ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి మృతి.. తండ్రి పరిస్థితి విషమం..

కళ్యాణదుర్గం(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్ల గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో కుమారుడు మృతిచెందగా.. తండ్రి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోళ్ల గ్రామానికి చెందిన వన్నూరుస్వామి... కుమారుడు ప్రజ్వల్ (6)తో కలిసి కళ్యాణదుర్గం పట్టణానికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. గోళ్ల సమీపంలో అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ద్విచక్రవాహనంలో ఉన్న తండ్రి, కుమారుడు ఎగిరి పడిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేటు వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగా ప్రజ్వల్ మృతిచెందాడు. వన్నూరుస్వామి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కారులో బెలూన్లు ఓపెన్ కావడంతో అందులోని వారు క్షేమంగా బయటపడ్డారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు రాయల్ వెంకటేశులుకు చెందిన కారుగా పోలీసులు గుర్తించారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని తెలుస్తోంది. ప్రమాద స్థలంలో ప్రజ్వల్‌ను ఒడిలో పెట్టుకుని తల్లి వన్నూరమ్మ బోరున విలపించడం కలచివేసింది. ప్రమాదంపై కళ్యాదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారం కోసం వచ్చి..


గోవిందరాజ్ మృతదేహం

రొళ్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని భాజంపాళ్యం గ్రామ సమీపాన బైక్‌ను ఆటో ఢీకొన్న ప్రమాదంలో చిరు వ్యాపారి గోవిందరాజ్(35)దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. కర్ణాటకలోని కంబదహళ్లి గ్రామానికి చెందిన గోవిందరాజ్ వ్యాపారం నిమిత్తం ద్విచక్రవాహనంలో వెళ్లి వస్తుండగా రత్నగిరి వైపు నుంచి వస్తున్న ఆటో రోడ్డు మలుపు వద్ద ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న గోవిందరాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేమాన్ని మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సార్...! జలహారతికి రండి

- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆహ్వానం


సీఎం చంద్రబాబు వెంట నడుస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో మడకశిర నియోజకవర్గంలో పలు చెరువులను నింపుతున్నారు. మడకశిర నియోజకవర్గ చరిత్రలోనే అమరాపురం చెరువును నీటితో నింపిన దాఖలాలు లేవు. హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలతో అమరాపురం చెరువును నీటితో నింపుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డిసెంబరులో నిర్వహించే జలహారతికి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆహ్వానించారు. తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో శనివారం నిర్వహించిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇదే సందర్భంలో జలహారతి కార్యక్రమానికి రావాలని విన్నవించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎంహెచ్ఓ ఈబీ దేవితో కలిసి జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలపై సమీక్షించారు. అనంతపురం రూరల్ కురుగుంట-2, యాడికి-1, రాయదుర్గం-1, కొర్రపాడు-1, కొర్రపాడు యూపీహెచ్‌సీలో జరిగిన మాతృ మరణాలపై ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రసవిస్తూ ఏ తల్లీ, జన్మిస్తూ ఏ బిడ్డా చనిపోకూడదన్నారు. కొర్రపాడు పరిధిలోని చదల్ల గ్రామానికి చెందిన రాధమ్మ మాతృ మరణానికి బాధ్యురాలైన ఆశా వర్కర్‌ను విధుల నుంచి తొలగించడంతోపాటు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యాడికి మండలం వీరన్నపల్లికి చెందిన హరిత అనే మహిళ మరణానికి కారణమైన ఆర్ఎంపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనీ, ఆశా, ఏఎన్ఎంపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలనీ, వైద్యాధికారికి మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కురుగుంటకు చెందిన మృదుల మృతికి కారణమైన వైద్య, ఆరోగ్య సిబ్బందికి మెమోలు జారీ చేయాలన్నారు. సమావేశంలో వైద్యులు జయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, శంషాద్‌బేగం, నారాయణ స్వామి, గంగాధర్ పాల్గొన్నారు.

కుష్ఠును ఆదిలోనే అరికట్టాలి

అనంతపురం వైద్యం(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు 14రోజులపాటు కుష్ఠు వ్యాధిపై సర్వే చేపడతారన్నారు. జిల్లాలోని ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ జయలక్ష్మి, డీఎస్ఎంఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాలి...

రెడ్ క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువయ్యేలా విస్తరింపజేయాలని సంస్థ నిర్వాహకులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ప్రథమ చికిత్స విధానంపై పరిశ్రమల్లోని కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా కార్మిక భద్రత మెరుగుపడుతుందన్నారు. రక్తనిధి కేంద్రాల్లో సరిపడా నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, రాష్ట్ర సభ్యుడు కాపు రామచంద్రరెడ్డి, వైస్‌చైర్మన్ డాక్టర్ లక్ష్మణప్రసాద్, కార్యదర్శి మోహనకృష్ణ పాల్గొన్నారు.

మురడి ఆలయ పవిత్రతను కాపాడుతా

- కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మురడి ఆలయ పవిత్రతను కాపాడుతానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మురడి ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడికి న్యాయం చేయాలనే విషయంలో తాను ఇచ్చిన లేఖపై సోషల్ మీడియాలో వివాదం చెలరేగిన నేపథ్యంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతశయన అనే అర్చకుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు డి.హీరేహాళ్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో కేసు నమోదు అయిందన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో అతన్ని ఆలయ అర్చకత్వం నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఆ తరువాత భార్య, భర్తలు రాజీపడి కోర్టులో కేసు కొట్టి వేయించుకున్నా రని వెల్లడించారు. తర్వాత వారి కుమార్తెతో కలిసి తన వద్దకు పలుమార్లు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవడానికి సాయం చేయమని కోరారని తెలిపారు. ప్రవర్తన సరిగాలేని వ్యక్తిని తాను సాయం చేయనని చెప్పానన్నారు. తర్వాత ఆ గ్రామ నాయకులు, మండల నాయకులు ఆలయంలో అర్చకత్వం చేసుకునేందుకు లేఖ ఇమ్మని చెప్తే ఐదునెలల కిందట ఇచ్చానన్నారు. ఒక పవిత్రమైన ఆలయంలో అర్చకత్వం చేసే విషయంలో వివాదం ఉన్నప్పుడు లేఖ ఇవ్వకపోయి ఉంటే బాగుండేదన్నారు. లేఖ ఇచ్చినంత మాత్రాన ఆలయంలో అతన్ని అర్చకుడిగా మళ్లీ నియమించలేదన్నారు. దీనిపై కొందరు వివాదం సృష్టించేందుకు ప్రయత్నిస్తుండటం దారుణమన్నారు. అయినా ఇది నైతిక ప్రవర్తనకు సంబంధించిన అంశం కాబట్టి ఓ ప్రజాప్రతినిధిగా వివరణ ఇవ్వాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి తలెత్తకుండా జాగ్రత్త వహిస్తానన్నారు.

నేటి నుంచి సీకే నాయుడు క్రికెట్ టోర్నీ


కెప్టెన్లతో రెఫరీల సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సీకే నాయుడు జాతీయ క్రికెట్ టోర్నీని నగరంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఆంధ్రా అండర్-23, పాండిచ్చేరి అండర్-23 జట్ల మధ్య ఈ మ్యాచ్ ఆదివారం నుంచి ఐదో తేదీ వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గతేడాది జరిగిన దులీప్‌ట్రోఫీ తరహాలోనే ఈ మ్యాచ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రా, పాండిచ్చేరి జట్లు అనంతకు చేరాయి. మైదానంలో శనివారం ఉదయం, సాయంత్రం ఇరుజట్ల క్రీడాకారులు బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ అంశాల్లో ప్రాక్టీస్ చేశారు. మ్యాచ్ అఫిషియల్స్ రెఫరీ నియతీలోకూర్, అంపైర్లు అభిజిత్ దేశ్‌ముఖ్, కేఆర్ వాసుకి, ఆంధ్రా కెప్టెన్లు హేమంత్‌రెడ్డి, సీయాన్ శ్యామ్ కంగయాన్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి మైదానంలో పిచ్, ఏర్పాట్లను పరిశీలించారు.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.10తో, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు.

ఉత్తరాలు రాయండి

తపాలాశాఖ సూపరింటెండెంట్ అమర్నాథ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే లెటర్ రైటింగ్ పోటీలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ సూపరింటెండెంట్ అమర్నాథ్ శనివారం ప్రకటనలో కోరారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా లెటర్ టు మై రోల్‌మోడల్ అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలలోపు, ఆ పైబడిన వారికి రెండు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి విభాగం ఇన్‌లాండ్ లెటర్ కార్డ్(ఐఎల్‌సీ) కేటగిరిలో 500 పదాలకులోపుగా ఉండాలన్నారు. రెండో విభాగం ఎన్వలప్ కేటగిరిలో 1000 పదాలకు మించకుండా రాయాలన్నారు. చేతితో రాసిన ఉత్తరం మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ బాషలలో రాసిన ఉత్తరాలను డిసెంబరు 8లోపు అనంతపురంలోని ప్రధాన తపాలా సూపరింటెండెంట్ కార్యాలయానికి పంపాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు అందజేస్తారన్నారు.

ఈఈఎంటీకి దరఖాస్తు చేసుకోండి: డీఈఓ

కొత్తచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఈఈఎంటీ-2026 పరీక్షకు విద్యార్థులు ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ క్రిష్ణప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ అనుమతితో ఎడ్యుకేషన్ ఏపీ ఫణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యందీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతుల విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు అన్నారు. ఈ పరీక్ష రెండు దశల్లో ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన పదో తరగతి విద్యార్థులకు రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు అందిస్తారన్నారు. ఏడో తరగతి విద్యార్థులకు వరుసగా రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు అందిస్తారని డీఈఓ తెలిపారు. జిల్లా స్థాయిలో కూడా నగదు బహుమతులు ఉంటాయన్నారు. వివరాల కోసం జిల్లా సైన్సు అధికారి తనూజ్‌కుమార్ (సెల్ నంబర్.9492843184)ను సంప్రదించాలన్నారు.

12 దాకా ఈ పంట నమోదు

అనంతపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ పంట నమోదు గడువును ఈనెల 12 దాకా పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1901538 ఎకరాలకు (సాగు చేసిన పంట పొలాలు, బీడు పొలాలు)గాను ఇప్పటి దాకా 1740276 ఎకరాల్లో (92శాతం) ఈ పంట నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈనెల 8 దాకా ఈ పంట నమోదులో పెండింగ్‌లోని సర్వే నెంబర్లు అన్ని నమోదు చేయాలన్నారు. 9 నుంచి 12 దాకా సామాజిక తనిఖీలో భాగంగా జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తామన్నారు. సామాజిక తనిఖీలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి, 13 తుది జాబితాను ప్రదర్శిస్తామన్నారు.

అవినీతే అభివృద్ధికి అడ్డంకి

విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అవినీతి.. దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పెద్ద అడ్డంకి అని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం పవర్ ఆఫీస్ ఆవరణలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఏపీటీఎస్ పోలీసు స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'నిజాయితీ ప్రమాణం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఈఈ జేవీ రమేష్, ఏపీటీఎస్ సీఐ విశ్వనాథ్ చౌదరి, ఏడీఈ రామకృష్ణ హాజరయ్యారు. ఎస్ఈ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ పనులను నిజాయితీగా చేయాలన్నారు. బాధ్యతగా చేయడం ద్వారా అవినీతి నిర్మూలించగలమన్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది అవినీతి నిర్మూలనకు కట్టుబడి ఉంటామనీ, ప్రతి పనిలో నిజాయితీ, పారదర్శకత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది నాగన్న, విద్యుత్ శాఖ డీఈఈలు రఘు, రవిశంకర్, ఎస్టీఓ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ షేక్ రోషన్, విజిలెన్స్ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్


సాయి సారిష్

గుంతకల్లుటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి సాయి సారిష్ చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించాడు. కర్నూలు పట్టణంలో అక్టోబరులో జరిగిన అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. రాపిడ్‌లో రేటింగ్ 1440, బ్లిట్జ్‌లో 1651 అత్యధిక రేటింగ్ సాధించి రికార్డ్ నెలకొల్పాడు. ఇతను దాదాపు రెండు సంవత్సరాలుగా కోచ్ అనిల్‌కుమార్, రామారావు వద్ద శిక్షణ పొందుతున్నట్లు తెలిపాడు.


ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు వెళ్తున్న మాజీ మంత్రి పల్లె, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి


సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

తనకల్లు/నల్లచెరువు/కదిరిఅర్బన్ నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లికి వచ్చారు. హెలిప్యాడ్ వద్ద నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. రెవెన్యూ శాఖమంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారధి ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్, ఆర్డీఓలు వీవీఎస్ శర్మ, సువర్ణ, ఆనంద్‌కుమార్, మహేష్, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎంఎస్ పార్థసారధి వీరన్న, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, వంశీ, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షురాలు ఫర్వీన్‌బాను, ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, తదితరులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

● కదిరి/తనకల్లు: తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో నిర్వహించిన ప్రజావేదికలో ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏ ముఖ్యమంత్రి మాట్లాడుతూ అనంతపురం జిల్లా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. జిల్లాలోని ప్రతి చెరువుకు, ప్రతి ఎకరాకు నీరిస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇవ్వడంపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. సీఎంను కలిసి ప్రత్యేక దన్యావాదాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు

ధర్మవరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు, చిగిచెర్ల గ్రామాల్లో ని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌లను ఆకుపూజతో అలంకరించి పూజలు చేశారు. ఆలయాల వద్ద గ్రామస్థులు దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రివేళాల్లో ఆలయాల్లో భజన కార్యక్రమాలు చేపట్టారు.

ఏడీజే కోర్టు ఏర్పాటుకు సీఎం హామీ

కదిరి లీగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏడీజే కోర్టును కదిరి కేంద్రంగా ఏర్పాటు చేయాలని స్థానిక న్యాయవాదులు దీర్ఘ కాలంగా పోరాటాలు చేస్తున్నారు. వారి కల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీతో నెరవేరేందుకు బాటపడింది. తలుపుల మండలం పెద్దన్న వారిపల్లి పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఏడీజే కోర్టు ఆవశ్యకతపై ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి నూటికి నూరుశాతం కదిరి కేంద్రంగా ఏడీజే కోర్టును ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. విషయం తెలియగానే కదిరి న్యాయవాద వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. అందుకు ప్రధాన కారణమైన ఎమ్మెల్యే కందికుంటకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన న్యాయవాదుల సంఘం కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సన్మానంలో... ఏడీజే కోర్టు ఆదేశాలతో తిరిగి వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.





పోలీస్ స్టేషన్లకు కొత్త వాహనాలు



కొత్త వాహనాల తాళం చెవిని ఎస్పీకి అందజేస్తున్న సీఎం

కదిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఏడు పోలీసు స్టేషన్‌లకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కొత్త వాహనాలను సమకూర్చారు. వాటి తాళంచెవులను శనివారం ముఖ్యమంత్రి చేతుల మీ దుగా ఎస్పీ సతీష్‌కు మార్‌కు అందజేశారు. నియోజకవర్గంలో ఉన్న పోలీసు వాహనాలు చాలా అధ్వాన స్థితిలో ఉన్నాయి, కొన్ని ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయి. పలు మార్లు గమనించిన ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ఏడు పోలీసు స్టేషన్లకు కొత్త వాహనాలు ఏర్పాటుచేయడంపై పోలీసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సింధూరరెడ్డి


వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

నల్లమాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శనివారం మండలలంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. మండలంలోని రెడ్డిపల్లి, బండవాండ్లపల్లి, చారుపల్లి, కొత్తపల్లి తండా, వేళ్లమద్ది, బండకింద తండాలో వారు పాల్గొని పింఛన్లు అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు ఎల్ఐసీ నరసింహులు, గడ్డం రమణారెడ్డి, బుట్టి నాగభూషణం నాయుడు, చిదంబర రెడ్డి, రమణారెడ్డి, కులశేఖర్ నాయుడు, కోట్లో మంజునాథ్ రెడ్డి, అరవిందు, ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం



బుక్కపట్నం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి పోలేపల్లి ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. దాతలు పోలేపల్లి చంద్రశేఖర్ శెట్టి, శకుంతలాదేవి దంపతులు ప్రతిష్ఠించిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుపై కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో యువకులు తేజ, హేమంత్, హరి, సాయి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా ఓడీసీ బాబా ఆరాధనోత్సవం

ఓబుళదేవరచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వెలసిన హజరత్ ఓడీసీ బాబా పదో ఆరాధనోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దర్గా నిర్వాహకులుబైపరెడ్డి ఆధ్వర్యంలో దర్గాను అలంకరించారు. రాత్రి బాగేపల్లి స్వామివారి ఆధ్వర్యంలో గంధోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి బాబా సమాధిని దర్శించుకున్నారు. ఆదివారం అన్నదానం, రాత్రి ఖవాలీ, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

7న హాకీ శతాబ్ది ఉత్సవాలు

ధర్మవరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారత హాకీ శతాబ్ది ఉత్సవాలను ధర్మవరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 7న జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ఏపీ హాకీ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ సూర్యప్రకాష్ తెలిపారు. ఆయన శనివారం ఉత్సవాల నిర్వహణపై కళా శాల మైదానంలో హాకీక్రీడాకారులతో కలిసి మాట్లాడారు. భారతహాకీ ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా ఒకే రోజే 1000 హాకీ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారని, ధర్మవరంలోనూ నిర్వహిస్తామన్నారు. అదేరోజు ధర్మవరం నుంచి హాకీ పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులను సత్కరిస్తామని తెలిపారు.

చదువుతోనే సమాజంలో గౌరవం: డీసీపీఓ

కొత్తచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో విలువ, గౌరవం ఉంటుందని డీసీపీఓ మహేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశా లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమాన్ని శనివారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ మహేష్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రజిత పాల్గొని మాట్లాడారు.

మృతుడు హైదరాబాదీ..!

ధర్మవరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన యాదాటి రాము(52)దిగా పోలీసులు గుర్తించారు. ధర్మవరం రూరల్ మండలం గొట్లూరు సమీపంలోని బిందెల ఫ్యాక్టరీ వద్ద గత నెల 28న రాత్రి గుర్తుతెలియని వ్యక్తిని, ఓ వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడు అనంతపురం ప్రభుత్వాసు పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిన విషయం విదితమే. అయితే మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియ ని వ్యక్తిగా రూరల్‌పోలీసులు కేసు నమోదు చేశారు. అతడి వివరా ల కోసం పోలీసు సిబ్బంది మృతుడి ఫొటోతో వివిధ వాట్సప్ గ్రూప్ లలో, పత్రికల్లో ప్రచురణ చేయించారు. దీంతో హైదారాబాద్ లోని కూకట్‌పల్లికి చెందిన మృతుడి కుటుంబ సభ్యులు శనివారం అనంతపురం వచ్చి, మృతుడు యాదాటి రాము(52)గా గుర్తించారు. మృతుడు ఆర్నెల్ల కిందట భార్య మృతిచెందినప్పటినుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడన్నారు. ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వచ్చేశాడని పోలీసులకు తెలిపారు. అన్ని ఆధారాలు పరిశీలించిన తర్వాత మృతదేహాన్ని కుమారుడు మోహన్‌బాబు, కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.



'భక్తితో మానసిక ప్రశాంతత'



తిరుమలకి పాదయాత్రగా వెళ్తున్న భక్త బృందం

మడకశిరటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా జీవితంలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతూ ఒత్తిడికి గురవుతుంటారని, భక్తి తోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పాదయాత్ర కమిటీ సభ్యులు సతీష్‌బాబు, గుండుమల కిష్టప్ప అన్నారు. శనివారం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ప్రతి ఏడాది కార్తీక మాసాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వరస్వామి మాలతో తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళతారు. అందులో భాగంగా ఈఏడాది భక్తులు మడకశిర నుంచి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

పురం నుంచి తిరుమలకు..

హిందూపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హిందూపురం నుంచి తిరుమలకు పాదయాత్ర బృందం శనివారం బయలుదేరి వెళ్లారు. పట్టణంలోని దర్మపురంలో ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తిరుమల పాదయాత్రను మున్సిపల్ చైర్మన్ రమేష్, సూగూరు ఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వైసీ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. వందమంది బృందంతో ఆరు రోజులపాటుతిరుమలకు పాదయాత్రగా వెళ్లనున్నారు. కార్యక్రమంలో నారాయణ, అశోక్‌కుమార్, మనోహర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యోగివేమన విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న రెడ్డిసంఘం నాయకులు

గోరంట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యోగివేమన విగ్రహ ప్రతిష్ఠకు రెడ్డిసంఘం నాయకులు శనివారం భూమిపూజ చేశారు. గోరంట్లలోని హిందూపురం రహదారిపై మండల కాంప్లెక్స్ క్రాస్ రోడ్డు వద్ద మంత్రి సవిత కేటాయించిన ప్రభుత్వ స్థలంలో వారు భూమి పూజ చేశారు. రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకు చెందిన రెడ్డిసంఘం నాయకులు పాల్గొన్నారు. మొదట చౌడేశ్వరీ ఆలయం వద్ద నుంచి ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ చేశారు. భూమి పూజ అనంతరం ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించి విగ్రహ ఏర్పాటుపై చర్చించారు. జనవరి 19న విగ్రహావిష్కరణ జరపాలని సమావేశంలో తీర్మానించారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

రొద్దం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో అధికారులు పీఎం సూర్య ఘర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం రొద్దం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసమూర్తి సిబ్బందితో కలిసి పీఎం సూర్యఘర్‌పై వివరించారు. 1కేవీకు రూ.30వేలు సబ్సిడీ, 2కేవీకు రూ.60వేలు, 3కేవీకు రూ.75వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసుకుంటే బ్యాంక్ ద్వారా లోన్ సౌకర్యం కల్పిస్తారన్నారు. లబ్ధిదారుడు తన వాటాకింద పదిశాతం డబ్బులు కట్టుకుంటే మిగిలిన మొత్తాన్ని బ్యాంక్ రుణం అందిస్తారన్నారు. పదేళ్లకాలంపాటు ఈఎంఐ చెల్లించుకోవచ్చన్నారు. సోలార్ విద్యుత్ వాడకంతోపాటు కరెంటు బిల్లు జీరోశాతంతో వస్తుందన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది వలి, ఓబులేసు, బాబు, టీడీపీ నాయకులు తిరుపాల్‌నాయుడు, నాగభూషణం, విష్ణు, గిరి, నాగ పాల్గొన్నారు.


సమస్యను పరిష్కరిస్తాం: కమిషనర్

పెనుకొండ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని మంగాపురం, కోనాపురానికి వెళ్లే రహదారి రోడ్డు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని కమిషనర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మంగాపురం, కోనాపురం వెళ్లే దారిలో రోడ్డు అధ్వాన్నంగా మారి గుంతలమయంగా మారింది. మాజీ సర్పంచ్ చంద్రకాంతమ్మ, పోలీస్ నారాయణనాయక్, కోనాపురం గ్రామస్థులు రోడ్డు సమస్యపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మంగాపురం రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

గోరంట్ల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ గొల్లపల్లికి చెందిన పార్వతమ్మ (47) హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఏఎస్ఐ షేక్షావలీ తెలిపారు. బీ గొల్లపల్లికి చెందిన రామప్ప భార్య పార్వతమ్మ కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతుండేదని, నొప్పి అధికం కావడంతో శుక్రవారం ఆమె జిల్లెడు పాలు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. ఆమెను వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం పంపగా చికిత్సలు పొందుతూ మృతిచెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

గుడిబండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుగీరణపాళెం గ్రామానికి చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జి రామచంద్ర(30) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి అక్కడకు చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్ర కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరి వెంట సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, మండల బీసీ సెల్ నాయకుడు బూదిపల్లి జయరామప్ప తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు
ప్రమాదం జరిగితేనే చర్యలు తీసుకుంటారా?



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

సోమందేపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వాటికి కంచెలేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. పట్టణంలోని రోడ్ల పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు వాటిని కనబడకుండా చేస్తున్నాయి. అవి ట్రాన్స్‌ఫార్మర్లలోకి చొచ్చుకెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు పట్టణంలో పదిదాకా ఉన్నాయి. జగ్జీవన్‌రామ్‌నగర్ రోడ్డు, పంచాయతీ కార్యాలయం పక్కన, ఎన్టీఆర్‌సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, కొత్తపల్లి రోడ్డు, సప్తగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పరిసరాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఇటు పంచాయతీ, అటు విద్యుత్‌శాఖాధికారుల నిర్లక్ష్యం పట్టణ ప్రజలకు శాపంగా మారుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. పశువులు, జంతువులు ప్రమాదానికి గురవుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖాధికారులకు కోరుతున్నా ప్రతిపాదనలు పంపించామంటూ కాలయాపన చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లు మృత్యుకుహరాలుగా దర్శనమిస్తున్నాయి. అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. వీరి నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణాలు పోతేనే స్పందిస్తారా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. విద్యుత్‌శాఖ ఏఈ పరమేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించి త్వరలో కంచె ఏర్పాటు చేస్తామన్నారు.

రాష్ట్రాభివృద్ధే అజెండా

బాబుపై నమ్మకంతోనే వరదల్లా పెట్టుబడులు: టీడీపీ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే అజెండా లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, పరిమళ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు యుఎఈ పర్యటన, లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన జైత్రయాత్రలా సాగిందన్నారు. రాష్ట్రాభివృద్ధి చెందకూడదని వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే అజెండాగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తుందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో చేయలేని అభివృద్ధి, తీసుకురాని పెట్టుబడులు, పరిశ్రమలు చంద్రబాబు నేతృత్వంలో వస్తున్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు మన రాష్ట్రం అన్నివిధాలా అవకాశాలున్నాయన్నారు. ప్రపంచంలో పేరుమోసిన పరిశ్రమలు మన రాష్ట్రానికి వస్తున్నాయంటే కేవలం చంద్రబాబుపై ఉన్న నమ్మకమేనన్నారు. అమరావతి, విశాఖ, తిరుపతి వంటి నగరాలకు ఇన్నోవేషన్ పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ఈనెల 14, 15న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, షఫీ, రామాంజినమ్మ, మంజునాథ్, రవీంద్రనాయుడు, నాగేంద్ర, రామాంజినమ్మ, కన్వీనర్లు శ్రీనివాసులు, అబి, రాజు, రమేష్, కౌన్సిలర్ నవీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానానికి దారి చూపండి

కొర్లకొండ ఎస్సీకాలనీవాసులు
శవాన్ని ఖననం చేయకుండా నిరసన



గంగాచ్చమ్మ మృతదేహాన్ని ఇంటి వద్దే ఉంచిన దృశ్యం

చిలమత్తూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మరణిస్తే శవాన్ని కాటికి తీసుకెళ్లడానికి కాసింత దారి కూడా లేదని కొర్లకుంట ఎస్సీకాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దారి కోసం ఎన్నోమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా స్పందనలేదని అన్నారు. గంగాచ్చమ్మ మృతదేహాన్ని పూడ్చేదిలేదని, స్మశానానికి దారి చూపాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో ఎస్సీ కాలనీ వాసులకు ప్రత్యేక శ్మశాన వాటిక ఉంది. అయితే దానికి సరైన దారి లేక వారు ఇబ్బంది పడుతున్నారు. శనివారం ఎస్సీ కాలనీకి చెందిన గంగాచ్చమ్మ (85) మృతి చెందింది. మృతదేహాన్ని ఖననం చేయడానికి స్మశానానికి తీసుకెళ్లాలి. అయితే దారి లేకపోవడంతో కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి వారితో మాట్లాడారు. అయితే దారి చూపే వరకు మృతదేహాన్ని పూడ్చే ప్రసక్తే లేదని ఎస్సీ కాలనీవాసులు మొండికేశారు. ఎస్ఐ మునీర్ అహమ్మద్ సర్దిచెప్పినా వారు వినలేదు. తహసీల్దార్ గ్రామానికి వచ్చి స్మశానానికి దారి చూపిస్తేనే మృతదేహాన్ని పూడ్చుకుంటామని తేల్చిచెప్పారు. అయితే తహసీల్దార్ అందుబాటులో లేరని, ఆదివారం ఉదయం వచ్చి దారి విషయం మాట్లాడతారని ఎస్ఐ వారికి తెలిపారు. ఆయన వచ్చిన తరువాతే మృతదేహాన్ని ఖననం చేస్తామంటూ ఇంటి వద్దే మృతదేహాన్ని ఉంచారు. దీనిపై ఎస్ఐ మునీర్ అహమ్మద్‌తో మాట్లాడగా స్మశానానికి దారి చూపాలని వారు కోరుతున్నారని, అది రెవెన్యూ అధికారుల పరిధిలోకి వస్తుందన్నారు. తహసీల్దార్ ఆదివారం ఉదయం వచ్చిన తరువాత దారి విషయం పరిష్కరిస్తామన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

ఇబ్బందిపడ్డ ప్రయాణికులు



ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

రొద్దం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమంతూరు గ్రామంలో హిందూపురం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు బస్టాండులో ఆగిపోయింది. శనివారం సాయంత్రం 4-30 సమయంలో హిందూపురం నుంచి రొద్దంకు వచ్చి తిరుగుప్రయాణంలో అవుతూ బస్టాండులో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలం చెల్లిన బస్సులతో ఇదేతంటా అంటూ మండిపడ్డారు.

'ఎమ్మెల్యే మాటలను వక్రీకరించారు'

పెనుకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరించారని బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐక్యూప సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుడైన ఎంఎస్ రాజు ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు పన్నిన కుట్రలో భాగమేనన్నారు. కార్యక్రమంలో బాబుప్రసాద్, రవికుమార్, రామాంజప్ప, ఆంధ్రూస్, తదితరులు పాల్గొన్నారు.

'అక్షరాస్యతతోనే సమాజ అభివృద్ధి'

గుడిబండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యత సాధనతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగరాజ్‌నాయక్, ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాంధ్రపై వలంటీర్, టీచర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం వయోజనులకు అక్షరాలు ఎలా నేర్పించాలని వాటిపై అవగాహన కల్పించారు. ఏపీఎం తిప్పన్న, ఏపీఓ జగదీశ్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కు తీసుకోవాలి'

పెనుకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గాంధీ సర్కిల్‌లో పీపీపీ ద్వారా ప్రైవేట్‌పరం చేయడానికి తీసుకున్న నిర్ణయంపై ముద్రించిన పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బాబావలి మాట్లాడుతూ కళాశాలలకు దశలవారిగా నిధులు కేటాయించి ప్రభుత్వమే పూర్తీచేయాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, కార్మిక సంఘం నాయకులు వెంకటరాముడు, సీఐటీయు నాయకులు నరసింహ, హబీబ్, తిప్పన్న, నాగప్ప పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఎమ్మెల్యే పీఏ వీరయ్య



సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న పీఏ వీరయ్య

లేపాక్షి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య ఆదేశించారు. శనివారం చోళసముద్రం గ్రామంలో ఆయన పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిమెంటు రోడ్డు వేయాలని, డ్రైనేజీలు నిర్మించాలని ఆయన దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. టీడీపీ కన్వీనర్ వెంకటాపురం అబి, బీజేపీ మండల కన్వీనర్ నర్సింహమూర్తి, స్థానిక నాయకులు ఆయన వెంట ఉన్నారు.

కల్లు దుకాణాలపై ఎక్సైజ్ మెరుపు దాడులు



కల్లు శాంపిళ్లను సేకరిస్తున్న సీఐ

హిందూపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో శనివారం కల్లుదుకాణాలపై ఎక్సైజ్ అధికారులు మెరుపుదాడులు చేశారు. కల్లుదుకాణాలవద్దకు వెళ్లి సీఐ లక్ష్మీదుర్గయ్య, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్యాంపుల్స్ తీసి తిరుపతి ల్యాబ్‌కు పంపనున్నట్లు సీఐ తెలిపారు. ఎవరైనా కల్తీకల్లు విక్రయిస్తే వారి లైసెన్స్ రద్దుచేయడమే కాక క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. పీడీయాక్ట్ కూడా నమోదు అవుతుందన్నారు. అదేవిధంగా కల్లుతాగేవారికి జరిగే నష్టాలను వివరించారు. ముఖ్యంగా అనారోగ్యంబారినపడి జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుందన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు పృథ్వీరాజ్, నారాయణస్వామి పాల్గొన్నారు.

వైభవంగా కన్నడ రాష్ట్ర అవతరణ దినోత్సవం



కన్నడమాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు

పావగడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మహాత్మగాంధీ స్టేడియంలో శనివారం అధికారులు కన్నడమాత చిత్రపటానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎంజీ స్టేడియంలో జాతీయ, రాష్ట్రీయ జెండాలను ఆవిష్కరించి పట్టణ ప్రజలకు కన్నడ రాష్ట్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నాగేంద్రప్ప, వడ్డె శ్రీనివాస్, జీవిత, నరసింహమూర్తిలను సన్మానించారు. ఎమ్మెల్యే వెంకటేశ్, ఈఓ ఉత్తమ్, బీఈఓ రేణుకమ్మ, మున్సిపల్ ముఖ్య అధికారి జాఫర్‌షరీఫ్, కసప అధ్యక్షులు కట్ట నరసింహమూర్తి, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు'

పావగడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ గ్రామాన్ని వాసవీ పెనుగొండగా మార్చినందుకు కర్ణాటక రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యూత్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ ఈ సేతురాం కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి సవితకు సంఘం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

కార్యకర్త మృతికి మంత్రి నివాళి

రొద్దం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త హనుమంతప్ప(65) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత ఆ గ్రామానికి చేరుకుని నివాళులు అర్పించి ఆర్థిక సాయం అందించారు. పార్టీ కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, అశ్వర్థనారాయణ, సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు, మనోహర్, నాగభూషణం, మురళి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన



నాగిరెడ్డిపల్లి సమీపంలో కందిపంటను పరిశీలిస్తున్న మంత్రి సవిత

రొద్దం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపల్లి, కుర్లపల్లి గ్రామ మధ్య ఉన్న కందిపంటను మంత్రి సవిత శనివారం పరిశీలించారు. వర్షాలు బాగా పడ్డాయని, పంట కళకళలాడుతోందని టీడీపీ నాయకులు తెలిపారు. ఎకరానికి ఎంత పెట్టుబడి వస్తుంది..? దిగుబడి ఎంత వస్తుంది..? తదితర వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. రెడ్డివారి మంజునాథ్, నారాయనప్ప, జయరాం తదితరులు ఆమె వెంట ఉన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే



వన్నూరప్పకి పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలు అందించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎగువ రామగిరి గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. అనంతరం మంచానికే పరిమితమై వృద్ధుడు వన్నూరప్పకు పింఛన్ పంపిణీ చేశారు. గ్రామంలో జరిగిన వాల్మీకి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలు వేసి పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ నాగరాజు, స్థానిక నాయకులు నాగభూషణ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కోట్ల రంగనాథ్, ఎంపీడీఓ సోనీబాయ్, కార్యదర్శి రాజేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



కొల్లకుంటలో పింఛన్ అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప



లక్ష్మీపురంలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్



మణేసముద్రంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి



గుడిబండలో పింఛన్లను పంపిణీ చేస్తున్న సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ తదితరులు

ఇంటి చుట్టూ మురుగునీరు

సమస్యను పరిష్కరించాలని బాధితుడి వేడుకోలు

పెనుకొండ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని కోనాపురంలో ఎస్సీ కాలనీకి చెందిన వెంకప్ప ఇంటి చుట్టూ మురుగునీరు చేరింది. దీంతో దోమలబెడద ఎక్కువై అనారోగ్యాలకు గురవుతున్నామని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వర్షం పడిందంటే తన ఇంటి చుట్టూ మురుగునీరు చేరుతోందని, ఆ నీరు వెళ్లేందుకు దారిలేకపోవడంతోనే సమస్య ఉత్పన్నమవుతోందని బాధితుడు పేర్కొన్నాడు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని కోరాడు.



ఇంటి చుట్టూ చేరిన మురుగునీటిని చూపుతున్న వెంకప్ప